## నామినేషన్ దాఖలుకు వేళాయే..

- నేటి నుంచి 10వ తేదీ వరకూ స్వీకరణ
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు..
- కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

మెట్‌పల్లి, నవంబర్ 2 : శాసనసభ ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియకు సమయం ఆసన్నమైంది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు గడువు నిర్ణయించగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లకు స్వీకరిస్తారు. కోరుట్ల శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి కోరుట్ల రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేయగా, ఇక్కడే నామినేషన్ల దాఖలు, స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుంది. రిటర్నింగ్ అధికారిగా రెవెన్యూ డివిజనల్ అధికారి వ్యవహరిస్తారు. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,36,773 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు, పురుషులు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలతో పాటు ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్‌పల్లి, కోరుట్ల మండలాల్లో కలిపి 262 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 24 రూట్లుగా విభజించి ఒక్కో రూట్‌కు సెక్టార్ అధికారులు, ఈఆర్‌వోలు 6, ఏఆర్‌వోలు 4 చొప్పున అధికారులు, ఎన్నికల సిబ్బందిని నియమించారు. ఇప్పటికే ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈవీఎంలు, ఎన్నికల ఫర్నీచర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కోరుట్ల పట్టణం ఎస్‌ఎఫ్‌ఎస్ (హైస్కూల్)లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

### నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

కోరుట్ల, నవంబర్ 2: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కోరుట్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో ఈనెల 3 నుంచి 10 తేదీ వరకు నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఉదయం 11 నుంచి 3 గంటల వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆర్డీవో కార్యాలయం 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తామని తెలిపారు. 13న నామినేషన్ పత్రాల స్క్రూటినీ, 15న నామినేషన్ల ఉప సంహరణ, 30న పోలింగ్ ఉంటుందన్నారు. స్క్రూటీని అనంతరం స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని సూచించారు. ఇక్కడ తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు ఉన్నారు.

### సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయండి

ఇబ్రహీంపట్నం, నవంబర్ 2 : కోరుట్ల పట్టణ శివారులో గల వెటర్నరీ కాలేజీ సమీపంలో నిర్వహించే సీఎం బహిరంగ సభకు ఇబ్రహీంపట్నం మండల ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి గురువారం ఒక ప్రకటనలో కోరారు. సీఎం కేసీఆర్ ఇచ్చే సందేశాన్ని కార్యకర్తలు గ్రామాల్లో తీసుకెళ్లి ప్రచారాన్ని నిర్వహించి, కారు గుర్తుకు ఓటేసేలా కృషి చేయాలని ఆమె కోరారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

మల్లాపూర్, నవంబర్ 2: మల్లాపూర్ మండల ట్రస్మా (ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం) అధ్యక్షుడిగా అల్వాల ఆత్మారాం నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ట్రస్మా సంఘం రాష్ట్ర ఈసీ సభ్యుడు సింగారపు అశోక్ జారీ చేశారు. అలాగే కార్యదర్శిగా తోట రవీందర్, కోశాధికారిగా మిట్టపెల్లి మహేశ్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. ఇక్కడ చిట్యాల శ్రీధర్, పోతు గోపి, సీబీ అనిల్ సింగ్, రాజేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రం పరిశీలన

మారుతీనగర్, నవంబర్ 2: వెల్లుల్ల గ్రామంలో జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి దివ్యాంగుల స్టాఫ్‌తో కూడిన పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా గురువారం జిల్లా సంక్షేమాధికారి ఆడెపు భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 236వ పోలింగ్ కేంద్రాన్ని ఎంపిక చేయగా కేంద్రంలోని మౌలిక వసతులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన సక్‌సమ్ యాప్‌పై బీఎల్‌వోలకు ఆయన అవగాహన కల్పించారు. దివ్యాంగులు ఈ యాప్‌లో ముందస్తుగా నమోదు చేసుకుంటే వసతుల కల్పనకు కేంద్ర సిబ్బంది తగిన ఏర్పాటు చేస్తారని ఆయన వివరించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలను అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సీడీపీవో తిరుమల, సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : డబ్బా గ్రామానికి చెందిన నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంజయ్



కోరుట్ల రూరల్ : చిన్నమెట్‌పల్లి లో పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

# బీఆర్‌ఎస్‌లో చేరికల జోష్

**కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు**

కోరుట్ల రూరల్, నవంబర్ 2: చిన్నమెట్‌పల్లి గ్రామంలో పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సభ్యులు బీఆర్‌ఎస్ పార్టీలో గురువారం చేరారు. బీఆర్‌ఎస్ కోరుట్ల నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యకర్త లు బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష నాయకుల మాయమాటలు నమ్మి మోసపోద్దని గ్రామస్తులకు సూచించారు. పని చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, సర్పంచుల ఫోరం గౌరవాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, నాయకులు నూత్‌పెల్లి ముత్తయ్య, మారు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి : బీఆర్‌ఎస్‌లో చేరిన నాగులపేట గ్రామస్తులతో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం, నవంబర్ 2 : డబ్బా గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, మాల కుల సంఘ సభ్యులు గురువారం సర్పంచ్ లింగంపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలోని బీఆర్‌ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కోరుట్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆకు రమేశ్, బక్కూరి దశరథ్, ఉల్లెంగుల గంగారాం, సుంకెర చిట్టి, ఉల్లెంగుల సాయన్న, బక్కూరి శంకర్, సుంకరి నరేశ్, గొర్రె రమేశ్, మాల కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి, నవంబర్ 2: నాగులపేటకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సమక్షంలో గులాబీ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం అని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలి.. ఎమ్మెల్యేగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను గెలిపించుకోవాలనే లక్ష్యంతో తాము బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు.

# బీఆర్‌ఎస్‌ను ఆదరించండి

- కారు గుర్తుకు ఓటేసి కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌ను గెలిపించండి
- గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణుల ప్రచారం



కోరుట్ల : మహిళ ను ఓటు అభ్యర్థిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, ప్రజా ప్రతినిదులు



ప్రచారం నిర్వహిస్తున్న దివ్యాంగుడు మాదస్తు ప్రవీణ్

కోరుట్ల, నవంబర్ 2: పట్టణంలోని 7, 14వ వార్డుల్లో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య ఆధ్వర్యంలో మహిళా ప్రజా ప్రతినిధులు బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. గడపగడపకూ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని, కారు గుర్తుకు ఓటు వేసి కోరుట్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ వైస్ ఎంపీపీ చీటి స్వరూప, కౌన్సిలర్లు సుల్తానా బేగం, బలిజ పద్మ, కో ఆప్షన్ సభ్యురాలు రెంజర్ల కల్యాణి తదితరులున్నారు.

### వికలాంగుడి ప్రచారం

ఇబ్రహీంపట్నం, నవంబర్ 2: మండల కేంద్రంతో పాటు వేములకుర్తి, గోదూర్, తిమ్మాపూర్, యామాపూర్, వర్షకొండ తదితర గ్రామాల్లో కోరుట్ల నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు మద్దతుగా గురువారం వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాదస్తు ప్రవీణ్ ప్రచారం చేశాడు. తన సొంత వాహనాన్ని ప్రచార వాహనంగా ఏర్పాటు చేసుకొని ఊరురా తిరుగుతూ సంజయ్ కల్వకుంట్లను గెలిపించాలని ఓటర్లను కోరారు. కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఆర్‌ఎంపీ, పీఎంపీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి పెంట లింబాద్రి, నాయకులు తుక్కారాం, దోమకొండ చిన్న రాజన్న, శేఖర్, ప్రహ్లాద్, శ్రావణ్, నవీన్ ఉన్నారు.

## ఉపాధ్యాయుడికి డాక్టరేట్ పట్టా

మేడిపల్లి, నవంబర్ 2: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మోత్కుల నారాయణగౌడ్ ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. తెలంగాణ సాహిత్యం గౌడుల వృత్తి జీవన చిత్రం అంశంపై చేసిన పరిశోధనకు ఓయూ వైస్ ఛాన్సలర్ దండెబోయిన రవీందర్‌యాదవ్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గురువారం రవీందర్‌యాదవ్‌ను ప్రిన్సిపాల్ రాజేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.



పట్టా అందుకుంటున్న నారాయణగౌడ్